# వసంతకోకిల

కథ

“నువ్వెళ్లి మీ రూమ్‌లో పడుకో డాడీ! మమ్మీ రాత్రి ఇక్కడే పడుకుంటుంది” తల్లికి అటూ ఇటూ పడుకున్న పిల్లలిద్దరూ ఆమెమీద చెరో కాలూ వేసి తండ్రికి టాటా చెప్పారు. నవీన్ నవ్వుకుంటూ వెళ్లిపోయాడు.

తన బెడ్రూమ్‌లోకి వెళ్లి అవీ ఇవీ సర్దుతూ బీరువా తీశాడు. హేంగర్‌కి వేలాడుతున్న పాలనురుగులాంటి తెల్లచీర కనబడింది. దాన్ని తీసి బైటపెట్టాడు. బీరువా మూసి పడుకున్నాడు.

లావణ్య పిల్లల్ని నిద్రపుచ్చి వచ్చి “ఈ చీరేమిటి?” అంది.

“ఇది కట్టుకోవాలి నువ్విప్పుడు” అన్నాడు నవీన్.

“ఎందుకబ్బా?”

“నేను ఏరి ఏరి కొనుక్కొచ్చిన చీరలన్నీ నువ్వు కాలేజీలో పిల్లలకి పాఠాలు చెప్పడానికి కట్టుకుంటావు. నా దగ్గరికి పాత చీరతో వస్తావు. నా మీద నీకు ప్రేమ తగ్గిపోయిందిలే” కినుకుగా అన్నాడు.

“ఒకప్పుడు చీర వల్ల నీకు అందం రావడం ఏమిటి? నువ్వు కట్టుకుంటే ఏ చీరైనా అందం వస్తుందని అనేవాడివి. కాబట్టి నీకే ప్రేమ తగ్గిందని నేను రిటార్టిస్తున్నా” అంది లావణ్య వక్కపొడి వేసుకుని అతని నడుముపై తలానించి అడ్డంగా పడుకుంటూ.

బుంగమూతి పెట్టుకున్న ఆమె ముక్కుపుడక మెరుపుని తదేకంగా గమనిస్తున్నాడు నవీన్.

“అయినా ఇండియన్ స్టాండర్డ్ హస్బెండ్‌లా ఈ సణుగుడేంటి? మనసులో మాట చెప్పకూడదా? మన పెళ్లినాటి ప్రమాణం ఏమిటి? మనిద్దరికీ ఎప్పుడు ఎటువంటి భావం కలిగినా ఒకరితో ఒకరు స్వేచ్ఛగా, నిర్భయంగా చెప్పుకోవాలనీ, అరమరికలులేని స్నేహం ఉండాలనీ. అవునా? ప్రతిరోజూ నువ్విలా చీర ఇస్తే నేను కట్టుకుంటానా?” నవీన్ చెవి మెలిపెడుతూ అందామె.

ఆమె వడిలో తలపెట్టి పడుకుంటూ అన్నాడతను.

“నీ గురించే ఆలోచిస్తూ ఎదురుచూడడం ఎంత బాగుంటుందో నాకు. మనం ప్రేమించుకునే రోజులన్నీ గుర్తొస్తాయి. అప్పుడు గార్డెన్స్‌లో, బస్టాపుల్లో ఇలాగే ఎదురు చూసేవాణ్ణి నీకోసం. మనమూ, ఈ పిల్లలూ ఈ జీవితం అంతా నిజమేనా? కలా? అని అనుమానపడుతుంటాను. ఆనందంతో గుండెలు బరువెక్కుతుంటాయి.”

అతని నుదుటిపై ముద్దు పెట్టుకుంటూ అందామె “అబ్బా! భావకవిత్వం మొదలుపెట్టావా? మరీ అంత సెన్సిటివ్‌గా ఆలోచించకూడదు.”

“అవునవును. ఇప్పుడు సెన్సువల్‌గా ఆలోచించాల్సిన టైమ్ కదూ!” ఆమె నడుం చుట్టూ చెయ్యి వేస్తూ మధురంగా నవ్వాడు నవీన్. ఆ నవ్వెంతో ఇష్టం లావణ్యకు. “వన్ సెకండ్...వన్ సెకండ్” అంటూ లైటార్పేసింది.

★★★

స్టాఫ్ రూమ్‌లో కూర్చుని క్లాస్‌కి ప్రిపేరవుతున్న లావణ్య గుంపుగా కొందరు లెక్చరర్స్ లోపలికి రావడం, అందులో ఒకతన్ని కొత్త లెక్చరర్‌గా పరిచయం చేసుకోవడం విన్నది. కానీ తలెత్తలేదామె. ఏదో రాసుకుంటూ వుండడంతో ఎవరూ ఆమెను పలకరించలేదు కూడా. కొంతసేపటికి అంతా వెళ్లిపోయారు.

“తను కూడా లేవాల్సిందేమో! ఆ వచ్చినవాడు పారిపోతాడా? ఇవాళ కాకపోతే రేపు పరిచయం అవుతాడు లెద్దూ” బద్ధకంగా అనుకుంది లావణ్య.

మర్నాడు లీజర్ అవర్‌లో తీరిగ్గా పేపర్ చదువుకుంటుండగా “నమస్తే మేడమ్. నా పేరు వేణుమాధవ్. ట్రాన్స్‌ఫర్‌మీద మీ కాలేజీకొచ్చిన ఇంగ్లీష్ లెక్చరర్‌ని” అంటూ పరిచయం చేసుకుంటున్న అతన్ని చూసి అప్రయత్నంగా లేచి నిలబడింది లావణ్య.

“హలో! నేను తెలుగు లెక్చరర్‌ని” అంది చిన్నగా నవ్వుతూ.

“నిన్న మీరు కోపంగా బుక్ చదువుతున్నారు. భయమేసి ఇవాళ వచ్చానన్నమాట” అన్నాడు చేతులు కట్టుకుంటూ.

“భలేవారే మీరు” అంటూ గలగలా నవ్వేసింది లావణ్య.

“చిన్న రిక్వెస్టు. ఇంకెప్పుడూ మీరు సీరియస్‌గా ఉండకూడదు. ఇలాగే నవ్వుతూ ఉండాలి. ప్రామిస్. ఓకే బై” అంటూ నవ్వుతూ వెళ్లిపోయాడు వేణు.

చాలాసేపటివరకూ ఆమె పెదవులమీద దరహాసం అలాగే వుండిపోయింది. స్వచ్ఛమైన, అమాయకమైన అతని మొహంలో పసిపిల్లలకుండే ప్రశాంతత కనబడిందామెకి. మొత్తానికి భలే సరదా మనిషి అనిపించిందామెకు.

★★★

ఆదివారం మధ్యాహ్నం పిల్లలిద్దరూ నిద్రపోతున్నారు. నవీన్ వీపుమీద తల పెట్టుకుని పడుకుంది లావణ్య. ఇద్దరికీ నిద్రరాక ఊరికే పడుకున్నారు.

“నవీన్! మా కొలీగ్ వేణుమాధవ్‌ని చూశావుకదా ఆ రోజు?”

“ఆ చూశాను కదా మొన్న మీ కాలేజీకి వచ్చిన రోజు.”

“ఎలా వున్నాడు? ఏమనిపించింది నీకు?”

“బానే వున్నాడు చూడడానికి. నీలాగే కొంచెం అమాయకుడు అనిపించింది. నీతో ఏవో కబుర్లు, కోతలుకోసి నవ్విస్తున్నాడు. నువ్వేమో చిన్న పిల్లలా నవ్వుతూ వింటున్నావతని మాటలు.”

“బానే గమనించావులే. నిజంగానే అందర్నీ నవ్విస్తూ నవ్వుతూ ఉండే మనిషతను. మంచివాడు.”

“ఒక్కసారి చూడగానే ఎవరెలాంటి వాళ్లో అంచనా వేసేస్తాను. ఏమనుకుంటున్నావు లావణ్య వెంగండంటే?” అన్నాడు నవీన్.

“నవీన్! నాకు వేణు పరిచయం అయింది కొద్దికాలమే అయినా ఎంతో ఆప్తుడుగా, ఆత్మీయుడిగా అనిపిస్తున్నాడు. ఇతను ఎలిమెంటరీ స్కూల్లో నా క్లాస్‌మేటేమో అన్పిస్తుంది. చిన్నప్పుడు మేమాడుకునే ఏడుపెంకులాట, ఖో ఆటల్లో ఈ వేణు ఉన్నాడనిపిస్తోంది. నేరేడుపళ్ళ కోసం ఎక్కడికో వెళ్లిపోయి అక్కడ కాలువలో స్నానాలు చేసిన గుంపులో ఇతనున్నాడనిపిస్తుంది.”

“అవునేమో. అడగలేకపోయావా?”

“ఆ! అవన్నీ నా భ్రమలు. అతను మా ఊరిలో చదివే అవకాశమేలేదు. ఎందుకోమరి ఈ వేణు నా బాల్య స్నేహితుడే అన్నంత దగ్గరగా అనిపిస్తోంది.”

“ఆ ఆటలు, పాటలు గుర్తొస్తే ఓకే. నాకేం దిగుల్లేదు. కానీ మీ ఇద్దరికీ బొమ్మల పెళ్ళయినట్టు గుర్తు రాకపోతే అదే పదివేలు” అన్నాడు నవీన్ కొంటెగా.

వీపుమీద గట్టిగా రెండు దెబ్బలు వెయ్యడానికి లేచింది లావణ్య. నవీన్ ఒడుపుగా తప్పించుకుని పక్క గదిలోకి పారిపోయాడు.


★★★

ఒకరోజు లంచ్‌లో నలుగురమ్మాయిలు వేణుమాధవ్ దగ్గరికి వచ్చి ఇంగ్లీషు నోట్స్ గురించి ఏదో అడిగి వెళ్లారు.

“ఏమయ్యా! నువ్వు బాచిలర్ అనుకుంటున్నారేమో అమ్మాయిలు” తన జోక్‌కి తనే విరగబడి నవ్వుతూ అంటున్నారు సుబ్బారావుగారు.

అప్పుడే స్టాఫ్‌రూమ్‌లోకొస్తూ ఆ మాటలు విన్నది లావణ్య. తనకెదురైన అమ్మాయిల్ని చూసింది కనుక సందర్భం అర్థమయిందామెకి. అటు తిరిగి వున్న వేణు ఆమెను చూడలేదు.

''స్టూడెంట్స్, టీచర్ మధ్య బంధం చాలా పవిత్ర మైంది మాస్టారూ. దాన్ని మనం వక్రబుద్ధితో చూడకూడదు. మహాపాపం'' కరుకుగా అంటూ వెళ్ళిపోయాడు వేణు. సుబ్బారావుగారి మొహం మాడిపోయింది.



వయసు పెరిగేకొద్దీ బుద్ధులు చిన్నవవుతుంటాయి ఇలాంటివాళ్ళకి. వేణు బాగా అన్నాడు చెప్పుతో కొట్టినట్టు అనుకుంది తృప్తిగా లావణ్య. వేణు సంస్కారం ఆమెకు ముచ్చటగొలిపింది.

★★★

ఆ రోజు జ్వరం వచ్చి కాలేజీ మానేసింది లావణ్య. నవీన్ కూడా బ్యాంక్‌కి సెలవుపెట్టి పిల్లల్ని స్కూల్‌కి పంపి లావణ్యని డాక్టర్ దగ్గరకు తీసుకువెళ్లాడు. సాయంత్రానికి జ్వరం తగ్గింది.

మర్నాడు ఉదయం లేచి బ్రెడ్ తిని కాఫీ తాగుతోంది లావణ్య. కాలింగ్ బెల్ మోతకు తలుపు తీసాడు. వేణు వచ్చాడు.

''హలో! గుడ్‌మార్నింగ్ రండి రండి'' అంటూ అతన్ని ఆహ్వానించి ''లావణ్యా ఇటురా! ఎవరొచ్చారో చూడు'' అన్నాడు నవీన్.

హాల్లోకి వచ్చి చూసిన లావణ్య మొహంలో సంభ్రమంతో కూడిన వింత వెలుగొచ్చింది.

''కూర్చోండి వేణు'' అంటూ కుర్చీ చూపించి తనూ కూర్చుంది. నవీన్ కాఫీ తేవడానికి కిచెన్‌లోకి వెళ్లాడు.

''మీకు ఒంట్లో బాగాలేక రాలేదని ఎవరో అన్నారు. ఓసారి చూద్దామనిపించింది. ఒకసారెప్పుడో మీ అడ్రస్ చెప్పారు. దాంతో వచ్చేసాను'' అన్నాడు వేణు.

''అయ్యో మీకు శ్రమ'' అంటూ నొచ్చుకుందామె.

కాఫీ తాగి ఒక పదినిముషాలు కూర్చుని నవీన్‌తోనూ, లావణ్యతోనూ మాట్లాడి వెళ్లిపోయాడు వేణు. నవీన్, పిల్లలూ వెళ్లిపోయాక కొంతసేపు పడుకుంది లావణ్య. లేచి వేణు గురించి ఆలోచిస్తూ ఉండిపోయింది. కళ్ళల్లో నీళ్లూరాయి ఆమెకు.

ఒక బాంధవ్యం తాలూకు మధురమైన బాధ. ఒక ఆనందంతో కూడిన దుఃఖం. ఆ మనిషి, ఆ వ్యక్తి తనకు ఏమీ కాకపోయినా ఎంతో అయిన భావన. ఇతను నాకు కొత్తవాడు కాదు. పాత మిత్రుడే. ఇతని ముందు నాకు ఇగో సమస్యలేదు. సంకోచంలేదు. ఏదో ఒక చక్కని అనుబంధం. అది మాటల్లో వ్యక్తపరిచేదికాదు. మనసుకు మాత్రమే అనుభవమయ్యే అనుభూతి.

సాయంత్రానికి ఆమెకి నీరసం పూర్తిగా తగ్గి తేలికగా అనిపించింది. స్నానంచేసి వంట చేసింది. ఇంటికొచ్చేసరికి తల్లి కనబడగానే పిల్లలిద్దరూ ఆనందపడిపోయారు. నవీన్ వచ్చి ఆమె వంట చేసినందుకు నొచ్చుకున్నాడు.

రాత్రి భోజనాలయ్యాక నవీన్ మంచం పై కూర్చుని ఏదో మాగజైన్ చదువుకుంటున్నాడు. పిల్లలిద్దరూ చదువుకుని నిద్రపోయారు. లావణ్య వచ్చి నవీన్ పక్కనే కూర్చుంది.

''నీ ఫ్రెండ్ వేణు చూడడానికి వచ్చాడు చూశావా. మంచివాడిలా వున్నాడు'' అన్నాడు నవీన్ బుక్ మూసేస్తూ.

''నేను చెప్పానా చాలా స్నేహస్వభావి అని. నాకు భలే ఏడుపొచ్చిందనుకో అతని అభిమానం చూసి. చిత్రంగా ఉంది కదూ ఇలాంటి అనుబంధం. దీనికి కారణం ఏమై వుంటుందంటావ్?''

అందామె వెనుక నుండి అతని వీపుపై వాలి.

''బహుశా నువ్వతన్ని ప్రేమిస్తున్నావేమో?'' అన్నాడు తను ఆమె చేతి గాజులు సవరిస్తూ.

''ఛీ...ఛీ పెళ్లయినదాన్ని, పెళ్లయినవాడ్ని ప్రేమించడం ఏంటి?'' అంది భర్త నెత్తిమీద మొట్టికాయ వేస్తూ.

''ప్రేమకు పెళ్లి పరమార్థం కాదు. పెళ్లయిన వాళ్ళు ప్రేమకు అనర్హులు కాదు.''

''అఫ్‌కోర్స్. కానీ నేను నా భర్తను ప్రేమించి పెళ్లాడాను. ప్రపంచంలోని ఆనందమంతా నా భర్తవల్ల నేను పొందగలిగాను. నా మనసంతటితోనూ నా భర్తని ప్రేమిస్తున్నాను. మరొకరికి అక్కడ స్థానం లేనంతగా'' అందామె అతని తలమీద ముద్దు పెట్టుకుంటూ.

''ఒకరితోనే ప్రేమ అంతమవ్వాలని సిద్ధాంతం ఏమీ లేదు. మరొకర్ని కూడా ప్రేమించవచ్చు.''

''లేదు నవీన్...'' ఏవో వివరించబోయి చాతకాక

అల్లూరి గౌరీలక్ష్మి

ఆగిపోయింది.

"నా ఉద్దేశ్యం ప్రకారం నీది ప్రేమ కా…ప్పు లావణ్యా. నీ మనసులో ఆడది ఒక మగవాణ్ణే ఒ…రే ప్రేమించాలి అనే సాంప్రదాయ భావం ఇంకిపో…ంది. అందుకే పిరికిగా నీ బుద్ధి నీ మనసును అది …మ కాదని బుజ్జగిస్తున్నది" అన్నాడతను.

ఒక్కసారిగా అతని వీపు పైనుండి లేచి …క్కన కూర్చుంది. ఆమె భ్రుకుటి ముడిపడింది. "నిజ…!" అన్నట్లు ఆశ్చర్యంగా చూసింది.

"అవును లావణ్యా. నిజాన్ని నిర్భయంగా ఒ…కోలేని హిపోక్రసీ అది. నీకు తెలియకుండానే నీ వి…క్షణా జ్ఞానం నీ మనోభావాలకు ముసుగులేస్తోంది. …న్ని నువ్వే గుర్తించలేనంతగా నీ బుద్ధి నిన్ను న…ంచేస్తోంది."

"నువ్వు జెలసీతోనో, కోపంతోనో అనడ…లేదు కదా?"

"లేదు. ఉన్న నిజం నా బుద్ధికి తోచింది …ుతున్నానన్నమాట."

"నన్ను అవమానిస్తున్నావేమో?" అంది …లోచనగా.

"పిచ్చీ. నిన్ను అవమానిస్తే నన్ను నేను అ…ానించుకున్నట్లే. నువ్వు వేరూ, నేను వేరూ కాదు కదరా బుజ్జీ" ఆమె జుట్టు సవరిస్తూ అన్నాడు.

"మరయితే నువ్వు చెప్పిందే నిజమంటావా"

"అవును."

"నాకు తెలియకుండానే నా మనసు తప్పు …స్తుందంటావా నవీన్?" దిగులుగా అందామె.

"అది తప్పని ఎందుకనుకుంటున్నావు? నీ …రిస్థితి నాకు వస్తే నేనూ అంతేనేమో?"

"మరయితే ఏం చేయాలి నవీన్?"

"ఏం చేయనక్కర్లేదు. జీవితంలో ఎన్నో అనుభవాలు ఎదురవుతూ వుంటాయి. విశ్లేషించు…ంటూ పోవడం తప్ప మనం చేయగలిగేముంటుంది? అనునయంగా అని తిరిగి మేగజైన్ విప్పాడు.

కొంతసేపు తనని తాను ఎనలైజ్ చేసుకుంట… పక్కనే వున్న కుర్చీలో కూర్చుండిపోయింది లావణ్య.

కొంతసేపయిన తరువాత నవీన్‌కి దగ్గర… వచ్చి కూర్చుందామె. నవీన్ బుక్ ముడిచి ఆమె వైపు చూశాడు.

"కాదు నవీన్. నువ్వు తప్పు విశ్లేషణ ఇస్తున్నావు. ప్రేమంటే ఏంటో నాకు తెలీదా నవీన్? నిన్ను నేను రెండేళ్లు తలమునకలుగా నన్ను నేను మర్చిపోయి ఏం తింటున్నానో, తాగుతున్నానో తెలీనంతగా ప్రేమించాను. పిచ్చిదాన్నైపోయాను నిరంతరం నీ ధ్యానంలో పడి నీ రూపం తలచుకుంటూ. ఆ పులకింతలు, తన్మయత్వం, మైమరపు వేరు. ఆ వాంఛకీ దీనికీ పోలికే లేదు తెలుసా" అతని కళ్లల్లోకి నమ్మకంగా చూస్తూ చెప్పిందామె.

ఆ కళ్లల్లోని నిజాయితీ చూసి తానన్న మాటలకి సిగ్గుపడ్డాడతను. తొందరపడి వ్యాఖ్యానం చేశానేమో అనిపించిందతనికి.

"ఇంకో సంగతి నవీన్. అతను మరీ మరీ గుర్తొస్తున్నాడుగానీ అతని రూపంకాదు. అసలు అతనెలా ఉంటాడు అన్న సంగతి నా మనసు రిజిస్టర్ చేయడం లేదు ఒక ఆత్మీయుణ్ణి తప్ప."

"నిన్ను ప్రేమించేటప్పుడు నా శరీరంలోని అణువణువూ నీ రూపం యొక్క ప్రతి అణువు చేత విపరీతంగా ఆకర్షింపబడేది. ఆ ప్రేమకీ, ఈ అభిమానానికీ శతసహస్రం తేడా వుంది నవీన్."

"మరయితే అతడ్ని కేవలం స్నేహితుడిగా మాత్రమే అభిమానిస్తున్నావేమో లావణ్యా" ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుంటూ అన్నాడు.

"స్నేహం ఎంతో మందితో చేశాను. అది ఆనందాన్నీ, ఆహ్లాదాన్నీ ఇచ్చింది. కానీ ఇక్కడ అంతకుమించి మనసుకు దగ్గరతనం, ఏ జన్మలోనో ఈ అనుంగు మిత్రుడితో వీడ్కోలు తీసుకుని వచ్చాను. ఈ జన్మలో ఇక్కడ కలిసాను అన్న సంతృప్తి, అతనితో మనసు విప్పి మాట్లాడి ఆత్మీయత పొందాలన్న తాపత్రయం. మనిద్దరం ఎలా ప్రేమించి పెళ్లి చేసుకున్నదీ, ఎన్ని కష్టాలు పడిందీ లాంటి విషయాలు అతనికి చెప్పాలనిపిస్తుంది తెలుసా? ఎన్నో ఏళ్ళ క్రితం విడిపోయిన ఆత్మబంధువులా అనిపిస్తున్నాడు వేణు."

స్ఫటికంలా స్వచ్ఛమైన మనసుతో మెరుస్తున్న లావణ్యని గుండెలకు దగ్గరగా, చాలా దగ్గరగా తీసుకున్నాడు నవీన్.

"బహుశా నీకు స్నేహాన్ని మించిన కల్మషం లేని ప్రేమ కలుగుతుండొచ్చు అతని మీద" అన్నాడు నెమ్మదిగా.

★★★

వేణుమాధవ్ ప్రయత్నాలు ఫలించి అతనికి ట్రాన్స్‌ఫర్ వచ్చేసింది. ఈ విషయం వేణూ వచ్చి చెప్పగానే స్టాఫ్‌రూమ్‌లో కూర్చున్న లావణ్య కదలడానికి శక్తిలేనిదానిలా, మాట్లాడడానికి మాటరానిదానిలా అయిపోయింది. ఆమె మనస్థితి అర్ధమైనట్టుగా వేణు కూడా మాట్లాడకుండా పక్కనున్న కుర్చీలో కూర్చున్నాడు.

రెండు నిముషాలు మౌనంగా ఉండిపోయారిద్దరూ.

ముందుగా లావణ్య తేరుకుంటూ అంది "వేణుగారూ! మీరు అకస్మాత్తుగా వచ్చి తీయని పాటలతో సేద తీర్చి వెళ్లిపోయే వసంత కోకిలలా మమ్మల్ని వదిలేసి పోతున్నారు. మీ పరిచయం అయిన ఈ రెండు మూడు నెలల్లో నాకు స్నేహం కంటే ఉన్నతమైన అనుభూతిని కలిగించారు. మీరు వెళ్లిపోవడం నాకు చాలా బాధ కలిగిస్తోంది. మళ్లీ ఎప్పుడు కలుస్తామో? కలసినా కేవలం కనబడడం తప్ప నిత్యం కల్సి పని చేసే అదృష్టం మాత్రం దొరకదు కదా!" ఆమె మాటల్లో దిగులు ప్రతిధ్వనించింది.

"అవును లావణ్యా. నిజంగానే ఈ కాలం మళ్లీ రాదు" అన్నాడు వేణు. అతని గొంతులో కూడా బాధ నిండింది.

"వేణూ! మీతో ఎన్నో విషయాలు మాట్లాడాలనీ, మనసు విప్పి ఎన్నో సంగతులు కలబోసుకోవాలనీ అనుకున్న నా కోరిక తీరనేలేదు. ఓ పని చేద్దాం. ఒకరోజు మొత్తం కూర్చుని మనిద్దరం మాట్లాడుకుందాం. అప్పుడే నాక్కాస్త తృప్తిగా వుంటుంది. లేకపోతే నేను భరించలేనేమో" అందామె నెమ్మదిగా.

"థాంక్యూ లావణ్యగారూ. నాక్కూడా అలాగే అనిపించింది. మీరు నాకిచ్చిన గౌరవానికి చూపే ఆత్మీయతకీ వెలకట్టలేను. ఓ పని చేయండి. రేపు ఆదివారం కదా. మీరు మా ఇంటికి లంచ్‌కి వచ్చేయండి. బోలెడంత టైమ్ మాట్లాడుకోవడానికి. నేనే మీకు వంట చేసి పెడతాను" ఆప్యాయంగా అన్నాడతను.

"మీకు వంట వచ్చా? వెరీగుడ్. ఇంకేం అలాగే వస్తాను" అంటూ అతని అడ్రస్ తీసుకుంది ఆమె.

★★★

"నవీన్! వేణూకి ట్రాన్స్‌ఫర్ వచ్చేసింది" భర్తతో అంది లావణ్య.

"అలాగా. పోన్లే. త్వరగానే సాధించాడు కంగ్రాట్స్ చెప్పు"


"రేపు నేను అతనింట్లో కొంతసేపు కూర్చుని అతన్ని మనింటికి తీసుకొస్తాను. నా లంచ్ కూడా అక్కడే సరేనా?" అందామె.

"రైట్. అలాగే కానీ" అన్నాడు నవీన్.

మర్నాడు వంట చేసి పెట్టి పిల్లల్ని భర్తకప్పగించి వేణూ ఇంటికి బయలుదేరింది లావణ్య. అడ్రస్ ఈజీగానే దొరికింది.

"రండి రండి" అంటూ నవ్వుతూ ఎదురొచ్చి ఆహ్వానించాడు వేణు.

వద్దన్నా వినకుండా లావణ్య కూడా అతనికి సాయం చేయడానికి ఉపక్రమించింది. ఇద్దరూ కలసి వంటతోపాటు వాదప్రతివాదనలూ ప్రారంభించారు. గంటలో బోలెడన్ని విషయాలు కలబోతలతో కొన్ని వంటకాల తిరగమోతలూ పూర్తయ్యాయి.



భోజనాలతోపాటు చాలా చర్చలు ముగించారు. వక్కపొడి వేసుకుని ఇద్దరూ ఎదురెదురుగా కుర్చీల్లో కూర్చున్నారు.

''విత్ యువర్ పర్మిషన్'' అంటూ లావణ్య శుభ్రంగా కుర్చీలో కాళ్ళు పెట్టుకుని బాసింపట్టు వేసుకుని తీరిగ్గా కూర్చుంది.

వేణు, భార్య కూతురితో ఇటీవల తీయించుకున్న ఫోటోలుంటే కొన్ని చూపించాడు. వాటిని ఎంతో ప్రేమగా చూసిందామె.

''మీకంటే మీ ఆవిడే అందంగా వుందని ఉడికించిందతన్ని. పాప కూడా బాగుందని మెచ్చుకుంది.

లావణ్య నవీన్‌తో తన ప్రథమ పరిచయం నుండి అందర్నీ ఎదిరించి ఇంట్లోంచి వచ్చేసి పెళ్లి చేసుకోవడం తర్వాత తాము పడిన ఇబ్బందులు, ప్రస్తుతం ప్రశాంతంగా సాగుతున్న తమ సంసారం గురించీ చెప్పింది.

వేణు చాలా ముచ్చటగా విన్నాడు.

''నాకు చాలా ఈర్ష్యగా వుంది తెలుసా మీ ప్రేమ కథ వింటుంటే. మీలాంటి అదృష్టవంతులు చాలా తక్కువ మంది ఉంటారు. ప్రేమించే వ్యక్తి దొరికినప్పుడు వాళ్లతో కలసి ఎటువంటి కష్టాన్నయినా సులభంగా ఎదుర్కోవచ్చు. నవీన్‌గారు మీకు తగిన వ్యక్తి'' అన్నాడు మనస్ఫూర్తిగా.

''నిజంగానే నవీన్ నాకొక వరం వేణూ'' ఒప్పుకుందామె నవ్వుతూ.

''ఇంకా చెప్పండి విశేషాలు'' అన్నాడు వేణు వెళ్లి మళ్లీ కాఫీ తెస్తూ.

''వేణుమాధవ్‌గారూ! జీవన గమనంలో ఎంతో మంది తారసపడుతూ విడిపోతూ వుంటారు. కానీ మీరు అతి తక్కువ వ్యవధిలో మనసుకు చాలా దగ్గరగా వచ్చి దూరమైపోతున్నారు. స్నేహానికి మించిన అనుభూతి ఒకటి వుంటుందని నాకు మీ వల్లనే తెలిసింది. మిమ్మల్ని తొలిసారి చూడగానే ఎంతో ఆత్మీయుడిలా అనిపించారు. మీ మొహంలోని స్వచ్ఛత, పసితనం నాకు నచ్చాయి. పరిచయం పెరిగేకొద్దీ మీరు నిజంగానే మంచి మనిషని అర్థమైంది. మీరు పరాయివారుకాదు, ఎప్పుడో చిన్నప్పటి నేస్తమై ఉంటారు. మీరు నాకు బాల్యమిత్రుడిగా విడిపోయి ఇప్పుడు కలిసారు అనిపించింది. మీతో సంకోచం లేకుండా అన్నీ మాట్లాడాలనిపించేది. ఇలాంటి ఫీలింగ్ ఎవరితోనూ నాకు కలుగలేదు. ఇప్పుడు చెప్పండి వేణూ. మీక్కూడా అలా ఏమన్నా అనిపించిందా? ఏం లేదా? మామూలుగా ఒక కొలీగ్ మాత్రమే అనిపించిందా?'' కాఫీ తాగి కప్పు పక్కన పెడుతూ అరచేతిలో మొహం ఆన్చుకుంటూ అడిగింది లావణ్య.

వేణు కొన్ని సెకన్లు తటపటాయించాడు

తర్వాత నెమ్మదిగా అన్నాడు ''మీరు నన్ను స్నేహానికి మించిన దగ్గరి వాడినని ఎంతో ఉన్నత స్థానం ఇచ్చి ఆదరించారు. ధన్యుణ్ణి. కానీ నిష్కల్మషమైన మీ ప్రేమకు నేను అర్హుణ్ణి కాదు లావణ్యా.''

''అదేమిటి? ఎందుకనుకుంటున్నారు అలా?'' ఆమె కంఠంలో మార్దవం.

''మనసుకింత దగ్గరగా వచ్చిన నేస్తానికి మనసులోని మాట చెప్పకపోతే అది మన స్నేహానికే అవమానం. మీ మనసును నొప్పించినాగానీ నిజమే చెబుతాను'' అన్నాడు.

చిరునవ్వుతో వినడానికి సిద్ధపడిందామె.

''కాలేజీ కలల రోజుల్లో నాకొక ఊహా ఊర్వశి వుండేది. నాకు కావాల్సిన లక్షణాలన్నీ వున్న అమ్మాయన్నమాట. అలాంటి అమ్మాయి కోసం వెతికి వెతికి వేసారిపోయాను. బహుశా పుట్టి వుండకపోచ్చనుకున్నాను. చివరికి ఆశ వదులుకుని అమ్మావాళ్ళు తీసుకొచ్చిన అమ్మాయిని మాట్లాడకుండా చేసేసుకున్నాను.

మిమ్మల్ని చూడగానే పాతరోజులన్నీ గుర్తొచ్చాయి. మిమ్మల్ని మొదటిసారి చూడగానే నేనొక్క క్షణం మూగబోయినట్లయిపోయాను. కారణం మీరు అచ్చు నా ఊహామూర్తిలా వున్నారు. అదృష్టవశాత్తు మీరు నన్ను ఆ రోజు పలుకరించలేదు. మర్నాటికి తమాయించుకుని నేనే మిమ్మల్ని పలకరించాను. మీరెంతో చక్కగా, సహృదయంతో నిర్మలంగా నవ్వారు.

మీతో పరిచయం పెరిగేకొద్దీ తెలిసింది మీరు కేవలం రూపంలోనే కాక వ్యక్తిత్వంలో కూడా నా ఊహల అంచనాలకి తగినట్టే వున్నారు. నన్ను బాధ, ఆనందం ఉక్కిరిబిక్కిరి చేసాయి. బాధకి కారణం పదేళ్ళక్రితం మీరు నాకు కనబడి ఉంటే ఎంత బాగుండేదో అని. ఆనందానికి కారణం ఒకనాటి నా ఊహా స్త్రీరూపం ఈ లోకంలో ఉండి ఉండదని అనుకోకుండా ఒక వ్యక్తి వున్నది సుమా'' అని ఎటో చూస్తూ చెప్పేసి ఆమెవైపు చూసాడు వేణు.

లావణ్య చేతి గోళ్లవైపు చూసుకుంటూ తల వంచి ఉండిపోయింది.

అది చూసి వేణు కించబడిపోయాడు. ''చూసారా! చెప్పకూడదనుకుంటూనే చెప్పి మీ మనసును బాధపెట్టాను. అయామ్ వెరీ సారీ లావణ్యా'' అన్నాడు బాధగా.

తలెత్తిన లావణ్య మొహంలో చిరునవ్వు అలాగే వుంది.

''ఎవరి స్పందన వారిది వేణూ. ఇందులో తప్పేముంది? అయితే మానవ సంబంధం మాత్రం శాశ్వతమైంది. మానసిక సాన్నిహిత్యం అపురూపమైనది. అలా నిజాయితీగా మీ మనసులో మాట చెప్పడం మీ ఔన్నత్యం. నేను ఈ హృదయాల పారదర్శకతనే నమ్ముతా వేణూ'' అందామె అతనివైపు ఆప్యాయంగా చూస్తూ.

ఆమె మాటలకి అతని గుండె కరిగిపోయింది. తన మనసుని ఆమె అర్థం చేసుకున్న తీరుకి దుఃఖం పొంగుకొచ్చిందతనికి. కళ్లవెంట రాబోయే నీళ్ళని బలవంతంగా ఆపుకున్నాడు. మాట పెగుల్చుకోవడం కష్టమయింది. ఒక నిముషం నిశ్శబ్దంగా ఉండిపోయాడు.

తర్వాత తేరుకుంటూ అన్నాడు ''అయితే ఆ భావాలన్నీ కొద్దిరోజులు మాత్రమే వున్నాయి. ఆ తర్వాత నా వివేచన మేల్కొంది. నా మనసును ట్యూన్ చేసుకున్నాను. నెమ్మదిగా మిమ్మల్ని ఒక మంచి స్నేహితురాలిగా భావించడానికి నిర్ణయించుకున్నాను. ఆ క్షణం నుంచీ ఈ క్షణం వరకూ అలాగే భావిస్తున్నాను. నా మనసులో ఎటువంటి మాలిన్యము లేదంటే మీరు నమ్మాలి లావణ్యా'' తడి గొంతుతో అంటున్న అతడి మాటలకి ఆమె మనసు ఆర్ద్రమయింది.

''ఎందుకు నమ్మనమ్మా. తప్పకుండా నమ్ముతాను'' అందామె స్నేహంగా అతనివైపు చూస్తూ.

''మీరు నా ప్రియబాంధవి. మిమ్మల్ని నా ఆప్తమిత్రురాలిగా మిగుల్చుకుంటాను జన్మజన్మలకూ. మీ స్థానం పూజనీయం నా మనసులో. నన్ను మీరు అర్థం చేసుకున్నందుకు మీకు రుణపడి వుంటాను.'' అంటూ ఈసారి కళ్లనుండి వచ్చే నీళ్లను ఆపుకోలేకపోయాడతను.

అతని కంట నీరు చూసినంతనే దుఃఖంతో ఆమె గొంతు పూడుకుపోయింది. మాట్లాడలేకపోయింది. తన ప్రియనేస్తాన్ని అంతరంగ మిత్రుడిని, ఆప్తుడిని తనివితీరా చూసుకోవడానికి కన్నీటి పొర అడ్డు పడుతుండటంతో తల విదిలించి కన్నీరు తుడుచుకుంది లావణ్య.

''తెలుగు టీవీ సీరియల్‌లా ఈ ఏడుపులేంటి?'' కొంటెగా నవ్వాడు వేణు.

లావణ్య కుర్చీలోంచి లేచి అతని ఎదురుగా వచ్చి చెయ్యి చాపింది. అప్రయత్నంగా వేణు చెయ్యందించాడు. అతని చేతినందుకుని మౌనంగా తన రెండు కళ్లకూ అద్దుకుని వదిలింది లావణ్య.

కృతజ్ఞతతో కదిలిపోయాడు వేణు. రెండు చేతులూ జోడించి ''థాంక్యూ వెరీ మచ్ మై ఫ్రెండ్!'' అన్నాడు తృప్తిగా లేచి నిలబడుతూ.

★

